
కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో రేవంత్ మాట్లాడుతుండగా ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు


నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాల మైదానంలో జేపీ నడ్డా మాట్లాడుతుండగా ఖాళీగా కనిపించిన కుర్చీలు

# జనమే రాలేదు.. వచ్చినోళ్లూ ఆగలేదు!

- కాంగ్రెస్ విజయభేరి సభలు వెలవెల
- మూడు చోట్ల టీపీసీసీ చీఫ్ రేవంత్ హాజరైనా ఖాళీ కుర్చీలే దర్శనం
- జనాలను ఆపేందుకు నానాతంటాలు
- పిడికెడుమంది కార్యకర్తలతోనే సభలు
- కాంగ్రెస్ పార్టీ ఓటమికి ఈ సభలే సంకేతమంటున్న ప్రజలు

కరీంనగర్/దుబ్బాక/దుబ్బాక టౌన్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): జనం లేక.. వచ్చినోళ్లూ కూడా ఆగకపోవడంతో కాంగ్రెస్ విజయభేరి సభలు అట్టర్‌ఫ్లాప్ అయ్యాయి. సాక్షాత్తు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హెలికాప్టర్ ఏస్కొని సభలకు హాజరైనా ప్రజలనుంచి స్పందన కరువైంది. కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లోని హుజూరాబాద్, మానకొండూరు, దుబ్బాక నియోజకవర్గాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభలను నిర్వహించింది. ముఖ్య అతిథిగా రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సభలకు జనాలు అంతంతే రాగా.. వచ్చినవాళ్లనుంచీ స్పందన కరువైంది. సభలు పేలవంగా ఉండటంతో రేవంత్ ప్రసంగం ప్రారంభానికి ముందే జనం వెనుదిరిగారు. అందరూ కూర్చోవాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంత బతిమిలాడినా ప్రజలు పట్టించుకోలేదు. రేవంత్ ప్రసంగించే సమయానికి పట్టుమని పిడికెడు మందికూడా లేరు. దీంతో ఆయన ఖాళీ కుర్చీలను చూస్తూ ప్రసంగించాల్సి వచ్చింది.

### జనాన్ని ఆపేందుకు నాయకుల తంటాలు..

హుజూరాబాద్ నియోజకవర్గం జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన రేవంత్ బహిరంగ సభకు వచ్చిన ప్రజలు వచ్చినట్టుగానే వెళ్లిపోవడం కనిపించింది. వెళ్లిపోతున్న జనాన్ని ఆపేందుకు కాంగ్రెస్ నాయకగణం నానా తంటాలు పడాల్సి వచ్చింది. కుర్చీల్లో కూర్చోవాలని పదేపదే మైక్‌లో చెప్పినా ప్రజలు వినకుండా వెళ్లిపోయారు. రేవంత్ వచ్చి మాట్లాడుతుండగా జనాల కంటే ఖాళీ కుర్చీలే ఎక్కువగా కనిపించాయి. మాట్లాడుతుండగానే మైదానంలోంచి ప్రజలు వెళ్లిపోతుండటం కనిపించింది. దీంతో రేవంత్ హడావిడిగా తన ఉపన్యాసం ముగించుకొని రేణికుంటకు బయలుదేరారు.

### రేవంత్ రాక ముందే జనం జంప్

మానకొండూర్ నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం రేణికుంటలో నిర్వహించిన సభ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీలేదు. సభకు రేవంత్ రాకముందే జనాలు వెళ్లిపోయారు. రేవంత్ మాట్లాడినప్పుడు పట్టుమని వెయ్యి మందికూడా జనాలు లేరు. హడావిడిగా ప్రసంగించి వెళ్లిపోయారు.

### దుబ్బాకలోనూ విముఖత

దుబ్బాకలో రేవంత్ సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. కాంగ్రెస్‌పై దుబ్బాక జనం తీవ్ర విముఖత చూపారు. ఈ సభకు సూమారు 30 వేల మందికిపైగా తరలించాలని ఆ పార్టీ నేతలు భావించారు. అయినా జనం నుంచి స్పందన రాకపోవడం.. వచ్చిన జనంకూడా ఓ 5-10 నిమిషాలు ఉండి వెనుదిరగడంతో టీపీసీసీ చీఫ్ ఖాళీ కుర్చీలను చూస్తూ ప్రసంగించాల్సిన పరిస్థితి వచ్చింది. కాగా, సాక్షాత్తు టీపీసీసీ చీఫ్ హెలికాప్టర్ ఏస్కొని వచ్చినా సభలు తుస్సుమన్నాయంటూ సోషల్‌మీడియాలో నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆరు గ్యారెంటీలు, కాంగ్రెస్ నాయకుల గాలిముచ్చట్లు వినేందుకు ప్రజలు ఇష్టపడటం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ ఓటమి ఖాయమైందని చెప్పేందుకు ఈ సభలే సంకేతమని ప్రజలు చర్చించుకుంటున్నారు.


గురువారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రేణికుంట సభలో రేవంత్ మాట్లాడుతుండగా వెనక భాగంలో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

### ఆ పాపం రేవంత్‌దే!

టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ పగ్గాలు చేపట్టాక హుజూరాబాద్, దుబ్బాకలో ఉప ఎన్నికలు వచ్చాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీఆర్‌ఎస్‌నుంచి బీజేపీలో చేరడం, దుబ్బాకలో ఎమ్మెల్యే రామలింగారెడ్డి కన్నుమూయడంతో ఇక్కడ ఉప ఎన్నికలు నిర్వహించారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ రేవంత్ బీజేపీతో లోపాయికారి ఒప్పందం చేసుకొని అత్యంత బలహీన అభ్యర్థులను నిలబెట్టారు. బీజేపీకి పరోక్షంగా మద్దతు ఇచ్చి ఇక్కడ కాంగ్రెస్ చావుకు కారణమయ్యారు. ఆ ఫలితం ఇప్పుడు ఎన్నికల్లో కనిపిస్తున్నదని ఈ రెండు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. నాడు బీజేపీతో రేవంత్ చేతులు కలపడం వల్లే ఈ రెండు చోట్లా కాంగ్రెస్ కనుమరుగైందని, అందుకే కాంగ్రెస్ విజయభేరి సభలకు జనాలు రాలేదని చెప్తున్నారు. హుజూరాబాద్, దుబ్బాకలో కాంగ్రెస్‌ను చంపిన పాపం రేవంత్‌దేనని మండిపడుతున్నారు.

### కాంగ్రెస్ ట్రిక్ ఫెయిల్

50 ఏండ్లు అరిగోస పెట్టిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజల్లో ఆదరణ తక్కువ. గత ఎన్నికల్లోనూ ఆ పార్టీని ప్రజలెవ్వరూ స్వాగతించలేదు. దీంతో ఈసారి ఆ పార్టీ సరికొత్త మైండ్‌గేమ్‌కు తెరలేపింది. సభలకు పెద్ద సంఖ్యలో జనాలు వస్తున్నారని, తమకు ప్రజల మద్దతు ఉన్నదని చెప్పుకొనేందుకు ఓ ట్రిక్ ప్లే చేసింది. సభ పెట్టిన ప్రతిచోటా చిన్న స్థలాన్ని ఎంపిక చేసుకొన్నది. ఓ నియోజకవర్గంలో సభ ఉంటే ఆ పక్కన ఉన్న నియోజకవర్గాలనుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలను తరలించింది. మొత్తంగా తమ సభలకు పెద్దసంఖ్యలో జనాలు వస్తున్నట్టు సీన్ క్రియేట్ చేసింది. అయితే, కాంగ్రెస్ నాయకుల మాటలు.. చేష్టలు నచ్చక సభలకు వచ్చేందుకు ప్రజలు విముఖత చూపారు. మొదట రెండు, మూడు రోజులు సభలు ఫుల్ అయినట్టు చూపించే ప్రయత్నం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఆ తర్వాత సభలనుంచి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. కాంగ్రెస్ ట్రిక్కులు కొద్దిరోజులు పనిచేసినా.. ఇప్పుడు పనిచేయడం లేదు. ఇతర ప్రాంతాల వాళ్లు సభలకు రావడంలేదు.. వచ్చినవాళ్లు కూడా స్పందించడం లేదు. చిన్న స్థలంలో సభ పెట్టినా జనం నిండటంలేదు. కుర్చీలన్నీ ఖాళీగానే కనిపిస్తున్నయ్. దీంతో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మణిక్‌రావుఠాక్రే, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య హాజరైనా.. టీపీసీసీ చీఫ్ రేవంత్ హెలికాప్టర్ ఏస్కొని వచ్చినా ఖాళీ కుర్చీలను చూస్తూ ప్రసంగించాల్సిన పరిస్థితి నెలకొన్నది.

## నడ్డా సభలోనూ కనిపించని జనం

- బీజేపీ ఇందూరు సభ వెలవెల
- సగానికి సగం ఖాళీ కుర్చీలే

నిజామాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎన్నికల ప్రచారానికి వరుసకట్టి వస్తున్న బీజేపీ నేతలకు ఇందూరు గడ్డపై పరాభవమే మిగులుతున్నది. సాక్షాత్తు ప్రధాని మోదీ పాల్గొన్న సభకే జనాల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉండగా, ఇప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభ పూర్తిగా వెలవెలబోయింది. గిరిరాజ్ కళాశాల మైదానంలో గురువారం బీజేపీ నిర్వహించిన ప్రచార సభకు జేపీ నడ్డా హాజరయ్యారు. ఆయన ప్రసంగం మొదలుపెట్టే సమయానికి మైదానంలో సగానికి పైగా కుర్చీలు ఖాళీగానే ఉన్నాయి. ఇది చూసి నివ్వెరపోయిన నడ్డా దిక్కుతోచని స్థితిలో నాలుగు మాటలతోనే ప్రసంగాన్ని ముగించేశారు. సభలో జనాలే లేకపోవడంపై ఆయన స్థానిక లీడర్లపై అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. బీజేపీ నేతలంతా నాలుగైదు రోజుల నుంచి ఆపసోపాలు పడుతూ జనాలను తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. నవంబర్ 15న ఇదే మైదానంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ప్రచార సభ జరిగింది. అత్యద్భుతంగా జరిగిన ఆ సభకు ప్రజలు పోటెత్తారు.

### అసత్యాలు.. ప్రేలాపనలు

జనంలేని సభను చూసి నిరుత్సాహపడిన నడ్డా.. కొద్దిసేపే మాట్లాడినప్పటికీ అన్నీ అసత్యాలే వల్లించాడని బీఆర్‌ఎస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. పదేండ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి చేసిన మేలును ఇసుమంతైనా వివరించలేదు. హిందీలో చేసిన ప్రసంగానికి ఇందూరు వాసులెవ్వరూ అంతగా స్పందించలేదు. ఆద్యంతం బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నిందలు మోపిన నడ్డా.. గాలి కబుర్లు, కల్లబొల్లి మాటలే చెప్పారు. చివరకు తమ మ్యానిఫెస్టోను సైతం సరిగా వివరించలేకపోయారు.

## రాహుల్, ప్రియాంక ఐరన్‌లెగ్‌లేనా?!

- వారు ప్రచారం చేసిన చోటల్లా కాంగ్రెస్‌కు పరాజయమే!
- యూపీ, పంజాబ్, తెలంగాణ, ఢిల్లీ ఎన్నికలే ఇందుకు నిదర్శనం
- కొడంగల్‌లో ప్రచారం చేసిన రాహుల్.. అయినా ఓడిన రేవంత్‌రెడ్డి
- తెలంగాణలోనూ ఇదే పరిస్థితి తప్పదనే అభిప్రాయాలు

హైదరాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి వస్తుండటంతో విచిత్రంగా సొంత పార్టీ అభ్యర్థులే కలవరపడుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో రాహుల్, ప్రియాంక ప్రచారం చేసిన స్థానాల్లో ఆ పార్టీ ఓడిపోతుండటమే ఇందుకు కారణం. గతంలో ఎన్నికలు జరిగిన పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఆ పార్టీ నామరూపాల్లేకుండా పోయింది. ఈ ఇద్దరు ప్రచారం చేసిన 95% స్థానాల్లో ఆ పార్టీ ఓడిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో వీరిద్దరు దాదాపు 200 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా కాంగ్రెస్ గెలిచింది కేవలం రెండంటే రెండే స్థానాలు. పంజాబ్‌లోనూ అదే పరిస్థితి. ఢిల్లీలో మరీ ఘోరంగా ఒక్క స్థానం కూడా దక్కలేదు. తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్, ప్రియాంక ప్రచారం ఆ పార్టీకి ఘోర పరాజయమే మిగిల్చింది. ఆ పార్టీకి కేవలం 19 సీట్లు మాత్రమే వచ్చాయి. ఆ ఇద్దరు అగ్రనేతలు ప్రచారం చేసిన ప్రతిచోట కాంగ్రెస్ ఓడిపోయింది. గత ఎన్నికల్లో కొడంగల్‌లో రాహుల్‌గాంధీ ప్రచారం చేశారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి ఓడిపోయారు. దీంతో ఈ ఎన్నికల్లో రాహుల్ గాంధీని మళ్లీ కొడంగల్‌కు ప్రచారం కోసం పిలిచే సాహసం రేవంత్‌రెడ్డి చేయడం లేదు. మిగిలిన నేతలు కూడా రాహుల్, ప్రియాంక ప్రచారానికి వస్తామంటేనే జంకుతున్నట్టు తెలిసింది. తమ నియోజకవర్గానికి అవసరం లేదని చెప్తున్నట్టు తెలిసింది. ఇప్పటివరకు వీరిద్దరూ కలిసి 25కుపైగా నియోజవర్గాల్లో ప్రచారం చేశారు. దీంతో అక్కడి అభ్యర్థుల్లో ఓటమి సెంటిమెంట్ భయం పట్టుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

### రాహుల్, ప్రియాంక ప్రచారం చేసిన రాష్ట్రాల్లో కాంగ్రెస్ పరిస్థితి

- 2022లో జరిగిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ మొత్తం 82 నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తే, ఒక్క స్థానంలోనే పార్టీ విజయం సాధించింది. ప్రియాంకాగాంధీ 120 నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తే, కాంగ్రెస్ ఒక్కచోటే గెలిచింది.
- 2022లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ 5 నియోజకవర్గాల్లో, ప్రియాంకాగాంధీ 8 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా రెండు చోట్ల మాత్రమే కాంగ్రెస్ గెలిచింది.
- 2020లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 సీట్లకుగాను కాంగ్రెస్ ఒక్కటి కూడా గెలవలేదు. రాహుల్‌గాంధీ 12, ప్రియాంకాగాంధీ 15 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా ఒక్కరిని కూడా గెలిపించలేకపోయారు.
- 2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ రాహుల్‌గాంధీ 45 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా 13 స్థానాల్లో, ప్రియాంకాగాంధీ 21 స్థానాల్లో ప్రచారం చేస్తే ఐదుచోట్ల మాత్రమే గెలిచింది.


సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్దలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజనులు

## రేవంత్‌రెడ్డిపై గిరిజనుల ఆగ్రహం

- సేవాలాల్‌ను అవమానించడంపై నిరసన
- పలు తండాల్లో దిష్టిబొమ్మల దహనం

సిర్గాపూర్/కల్హేర్/నాగల్‌గిద్ద, నవంబర్ 23 : పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీరుపై సంగారెడ్డి జిల్లా గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ బహిరంగ సభలో గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ చిత్రపటం అందించేందుకు గిరిజనులు యత్నిస్తుండగా రేవంత్‌రెడ్డి దురుసుగా వ్యవహరించి జ్ఞాపికను పక్కకు తోసేశారు. తమ ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్‌ను అవమాన పరిచాడని గిరిజనులు గురువారం జిల్లాలోని పలుచోట్ల రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కల్హేర్ మండలం పొమ్యానాయక్ తండా, సిర్గాపూర్ మండలం లక్ష్మణ్‌నాయక్‌తండాలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నాగల్‌గిద్ద మండలంలోని పలు తండాల్లో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి రేవంత్ తీరును ఖండించారు.

## కోనేరు కోనప్పకు ఊరట

### అరెస్టును నిలిపివేసిన హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): సిర్పూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు హైకోర్టు ఊరట కల్పించింది. ఆయన అరెస్టును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 12న బీఆర్‌ఎస్, బీఎస్పీ కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తడంతో ఇరు పక్షాలు పరస్పరం కేసులు దాఖలు చేసుకున్నాయి. సయ్యద్ ఫయాం అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కోనేరు కోనప్పతోపాటు అలీంఖాన్, కోనేరు ఫణికుమార్, కోనేరు శ్రీనివాస్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని కొట్టివేయాలని కోరుతూ కోనప్ప దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ గురువారం విచారణ జరిపారు. పోలీసులతోపాటు ఫిర్యాదుదారుకు నోటీసులు జారీచేసి, కౌంటర్లు దాఖలు చేయాలని స్పష్టం చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకు కోనప్పను అరెస్ట్ చేయరాదని పోలీసులను ఆదేశించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను డిసెంబరు 7కు వాయిదా వేశారు.

## అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థికి నిరసన సెగ

- ఇందిరమ్మ ఇండ్ల అవినీతిపై బోరవెల్లి గ్రామస్థుల నిలదీత
- కవరేజీ చేస్తున్న 'నమస్తే' విలేకరికి సంపత్ అనుచరుల బెదిరింపు

మానవపాడు, నవంబర్ 23: అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్‌కు గురువారం నిరసన సెగ తగిలింది. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో ఒక్కొక్కరు పదుల సంఖ్యలో లబ్ధి పొందారని, నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు రాలేదని జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం బోరవెల్లి గ్రామ ప్రజలు నిలదీశారు. సంపత్‌కుమార్ బోరవెల్లిలో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇండ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమే ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని చెప్పారు. అదే గ్రామానికి చెందిన వెంకటన్న మరికొందరు కలిసి సంపత్‌కుమార్‌ను నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు కాలేదని అన్నారు. అక్కడే ఉన్న సంపత్ అనుచరులు వెంకటన్నను తోసుకుంటూ వెళ్లిపోయారు. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న నమస్తే విలేకరి వద్దకు సంపత్ అనుచరులు వచ్చి సెల్‌ఫోన్ లాక్కునే యత్నం చేశారు. విలేకరిపై దాడికి యత్నించారు. అంతు చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు.


బోరవెల్లి గ్రామంలో అలంపూర్ కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్‌ను ప్రశ్నిస్తున్న వెంకటన్న

### లోకం పోకడ


మన పార్టీ గుర్తును జనం ఇలాగే బాగా గుర్తు పడతారని...

## రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

- బంగాళాఖాతంలో బలహీపడిన అల్పపీడనం
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడటంతో రాష్ట్రంలో మూడు రోజులు పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 26 వరకు పలు ప్రాంతాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, భారీ వర్షాలు లేవని స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, ఉదయం పొగ మంచు కమ్మేస్తుందని చెప్పింది. ఉపరితల ఆవర్తనంతో ఏపీలో వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించింది.

### చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| రంగారెడ్డి | 17.5°c | 35.0°c |
| ఆదిలాబాద్ | 17.7°c | 35.8°c |
| నల్లగొండ | 18.4°c | 28.0°c |
| మెదక్ | 18.5°c | 34.9°c |
| మహబూబ్‌నగర్ | 21.7°c | 27.6°c |
| నిజామాబాద్ | 21.2°c | 32.5°c |
| హైదరాబాద్ | 21.5°c | 24.7°c |
| వరంగల్ | 22.0°c | 28.0°c |
| కరీంనగర్ | 22.0°c | 29.0°c |
| ఖమ్మం | 22.0°c | 30.0°c |

## 'దళితబంధు'తో సీతక్క తనయుడి వసూళ్లు

- దళితుడి నుంచి రూ.3 లక్షలు తీసుకున్న సూర్య
- 8 నెలలుగా తిప్పకుంటూ తీవ్ర వేధింపులు
- విసుగెత్తి 'అంబేద్కర్' ఎదుట బాధితుడి నిరసన
- మీడియాకు గోడు వెళ్లబోసుకున్న దయాకర్



ములుగు, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ): ములుగు నియోజకవర్గంలో నిరంతరం ప్రజాసేవలోనే మునిగితేలుతున్నట్టుగా సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలతో హల్‌చల్ చేసే స్థానిక ఎమ్మెల్యే సీతక్క.. అదే స్థాయిలో రోజుకో అవినీతి ఆరోపణలతో జనం నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నది. గతంలో సీతక్క అనుచరులు దళితబంధు పేరుతో దళితుల నుంచి డబ్బులు వసూలు చేసిన విషయంలో విమర్శల పాలయ్యారు. ఆ ఘటనను మరువక ముందే గురువారం మరో అవినీతి ఆరోపణ వెలుగుచూసింది. ఈ సారి అవినీతికి పాల్పడింది ఏ కాంగ్రెస్ నాయకుడో లేదా ఆమె అనుచరుడో కాదు.. స్వయాన సీతక్క తనయుడు సూర్యనే 'దళితబంధు'తో వసూళ్లకు పాల్పడ్డాడని సాక్షాత్తు బాధితుడే ఆరోపించాడు. ఈ మేరకు బాధితుడు, ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు అంకేశ్వరపు దయాకర్ మీడియా ముందు తన గోడు వెల్లబోసుకున్నాడు. 'ఎనిమిది నెలల క్రితం తాడ్వాయి మండలం కాటాపూర్‌కు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు మర్రి నరేశ్ నాకు దళితబంధు ఇప్పిస్తానని చెప్పాడు. దీంతో నేను, నరేశ్ కలిసి జగ్గన్నపేటలో సీతక్క కుమారుడు సూర్యతో మాట్లాడగా.. దళితబంధు రావాలంటే రూ.3 లక్షలు ఇవ్వాలని చెప్పాడు. వెంటనే రూ.2 లక్షలను నా ఖాతా నుంచి నరేశ్ బ్యాంక్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాను. మిగిలిన రూ.లక్ష నగదును సూర్యకు ఇవ్వాలని నరేశ్‌కు ఇచ్చాను. మొత్తం రూ.3 లక్షలు చెల్లించిన విషయాన్ని సూర్యకు తెలుపగా.. దళితబంధు లిస్టులో నీ పేరు ఉంటదని చెప్పాడు. తీరా లబ్ధిదారుల లిస్ట్ చూస్తే అందులో నా పేరు లేదు. దీంతో సూర్యను నా డబ్బులు ఇవ్వాలని పలు మార్లు అడిగితే.. రేపు, మాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నాడు. పైగా.. నాకు నీ ద్వారా రూ.2 లక్షలే వచ్చాయి. మిగిలిన రూ.లక్ష మర్రి నరేశ్ తీసుకున్నాడు. నేను రూ.2 లక్షలే ఇస్తా. ఏం చేసుకుంటావో చేసుకో' అంటూ సూర్య బెదిరించాడని బాధితుడు వెల్లడించాడు. తనకు న్యాయం చేయాలని ములుగులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశానని చెప్పాడు. కాగా.. దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు సీఎం కేసీఆర్ దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టి పూర్తి సబ్సిడీతో రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందిస్తుంటే.. ఎమ్మెల్యే సీతక్క కుమారుడు, అనుచరులు దళితబంధు ఇప్పిస్తామని ఆశ చూపి దళితుల నుంచి డబ్బులు వసూలు చేయడంపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు.